సాక్షి విశాఖపట్నం

గురువారం । 27 । ఫిబ్రవరి । 2025

వందే శివం శంకరం



ఎంవీపీకాలనీ సెక్టార్-6లోని పార్వతీముక్తేశ్వరాలయంలో జ్యోతిర్లింగాలకు అభిషేకాలు చేస్తున్న భక్తులు

ఘనంగా మహాశివరాత్రి వేడుకలు

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



ఎంవీపీ కాలనీ శివాలయంలో దీపారాధన చేస్తున్న భక్తులు



పాతనగరం భావన రుషి ఆలయంలో ధ్వజస్తంభం వద్ద పూజలు నిర్వహిస్తున్న మహిళలు

మహా ప్రాణ దీపం.. శివం శివం..
మహా దివ్య తేజం.. శివం శివం..

నీలకంఠుని సేవలో భక్తులు తరించారు. హరహర మహాదేవ శంభోశంకర.. వందే శివం శంకరం స్మరణలతో శైవక్షేత్రాలు మార్మోగాయి. మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం జిల్లాలోని ముఖ్యంటి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచే భక్తులు ఆలయాల వద్ద బారులు తీరారు. పలు ఆలయాల్లో రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు వైభవంగా జరిగాయి. భోళా శంకరునికి భక్తులు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. జిల్లా అంతటా ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది.



అగనంపూడి జాబిలీహిల్స్‌లోని ఆలయంలో..



పరమేశ్వరుని సన్నిధిలో..



సీతంపేటలో పార్వతీశ్వరునికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు



శివలింగానికి అభిషేకం చేస్తున్న టీఎస్సార్



ఆర్.కె. బీచ్‌లో ఏర్పాటు చేసిన కోటి శివలింగాలు

సాగరతీరం.. శివనామ స్మరణం

ఏయూక్యాంపస్: సాగరతీరం శివ పంచాక్షరి మంత్రంతో మార్మోగింది. డాక్టర్ టి.సుబ్బరామిరెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ఆర్.కె. బీచ్ వద్ద నిర్వహించిన 40వ మహా కుంభాభిషేకం నేత్రపర్వంగా సాగింది. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో నగరవాసులు హాజరై.. తమ స్వహస్తాలతో శివయ్యకు అభిషేకాలు చేశారు. మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ టి.సుబ్బరామిరెడ్డి(టీఎస్సార్) ప్రయాగరాజ్ నుంచి తెప్పించిన పవిత్ర జలాలతో శివలింగాలకు అభిషేకాలు జరిపించారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమంలో కోటి ఎనిమిది లక్షల శివలింగాలకు పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలు, పళ్ల రసాలతో భక్తులే స్వయంగా అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం శివపార్వతుల కల్యాణం, హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మహా కుంభాభిషేకం కార్యక్రమం నిర్వహించిన ప్రాంగణం ఆధ్యాత్మికతను, భక్తి భావాన్ని సంతరించుకుంది. పెద్ద సంఖ్యలో నగరవాసులు కుటుంబ సభ్యులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. శివలింగాల వద్ద భక్తులు ఫొటోలు, సెల్ఫీలు తీసుకున్నారు. నిత్యం సందర్శకులు, పర్యాటకులతో అలరించే సాగరతీరం.. పూర్తి భిన్నంగా ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.



మాడుగుల నాగఫణి శర్మకు అవధాన బ్రహ్మ బిరుదును ప్రదానం చేస్తున్న హాస్యనటుడు బ్రహ్మానందం, టీఎస్సార్

ఈశ్వర భక్తి, శక్తి శాశ్వతం

ఏయూక్యాంపస్: అందం, ఆహారం, ఐశ్వర్యం శాశ్వతం కాదని.. ఈశ్వర భక్తి, శక్తి శాశ్వతమని మాజీ కేంద్రమంత్రి టి.సుబ్బరామిరెడ్డి అన్నారు. శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని బీచ్‌రోడ్డులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజలంతా సంతోషంగా ఉండాలనే ఉద్దేశంతో ఏటా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా శతావధాని మాడుగుల నాగఫణి శర్మకు అవధాన బ్రహ్మ బిరుదును ప్రదానం చేశారు. ప్రముఖ సినీ హాస్యనటుడు బ్రహ్మానందం, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, శ్రీధర స్వామి తదితరులు ప్రసంగించారు. విశాఖ ప్రజల సంతోషాన్ని, అభివృద్ధిని కాంక్షిస్తూ ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడంపై సుబ్బరామిరెడ్డిని అభినందించారు. అనంతరం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, పౌరాణిక నాటకం నగరవాసులను అలరించాయి.



నీలకంఠునికి నాట్య నివేదన

శివరాత్రి పర్వదినాన నీలకంఠునికి సాగర తీరంలో నాట్య నివేదన చేశారు. పైన నీలి మేఘం, చెంతనే నీలి సంద్రం.. 'నిమగ్న'పేరిట పరంపర ఫౌండేషన్ నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ నాట్యాచార్యులు రమా వైద్యనాథ్, బృందంతో చేసిన నృత్యాలు విశాఖవాసుల మనసుల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించాయి. కాశీ విశ్వేశ్వరుడిని, కంచి కామాక్షిని కీర్తిస్తూ వీరు చేసిన నృత్యాలు, రాధాకృష్ణుల లీలల్ని వర్ణిస్తూ చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. యువతను శాస్త్రీయ నృత్య కళలవైపు నడిపించే దిశగా ఈ కార్యక్రమం కొనసాగింది.

8లో

నేడే ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

- ఉదయం 8 నుంచి ప్రారంభం
- ఎన్నికల బరిలో 10 మంది అభ్యర్థులు
- జిల్లాలో 13 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు
- ఓటుహక్కు వినియోగించుకోనున్న 5,529 మంది టీచర్లు



మెటీరియల్ తరలిస్తున్న సిబ్బంది

కూటమిలో కుంపట్లు



రాజకీయ రంగు పులుముకున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు

రెండుగా విడిపోయిన కూటమి పార్టీలు

పాకలపాటికి టీడీపీ, జనసేన మద్దతు, గాదెకు కమలం అండ

ఒకరిపై ఒకరు పైచేయి సాధించేందుకు ప్రయత్నాలు

విశాఖ సిటీ: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు కూటమి పార్టీల్లో కుంపట్లు రాజేస్తున్నాయి. పార్టీలకతీతంగా జరగాల్సిన ఎన్నికలకు రాజకీయ రంగు పులిమాయి. నిన్న మొన్నటి వరకు పొత్తుల పేరుతో హత్తుకున్న నేతలు.. ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ తరువాత ఒక్కసారిగా కత్తులు దూసుకుంటున్నారు. ఒక్కో పార్టీ ఒక్కో అభ్యర్థికి మద్దతుగా నిలుస్తూ ఒకరిపై మరొకరు విమర్శనాస్త్రాలు సంధించుకుంటున్నారు. వాస్తవానికి ఈ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 10 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నప్పటికీ.. ప్రధానంగా ఇద్దరి మధ్యే పోటీ అన్న విధంగా ఈ కూటమి పార్టీలు వ్యవహరిస్తున్నాయి. తెలుగుదేశం, జనసేన పార్టీలు పాకలపాటి రఘువర్మకు మద్దతుగా నిలవగా, బీజేపీ మాత్రం గాదె శ్రీనివాసులు నాయుడుకు అండగా ప్రచారం చేస్తోంది. వీరి మధ్య నెలకొన్న ఈ ఆధిపత్య పోరు తుది అంకానికి చేరుకుంది. ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం ఉదయం 8 గంటలకు ప్రారంభం కానుంది. ఎవరి ప్రాబల్యం పనిచేసిందో బ్యాలెట్‌లో ఉపాధ్యాయుల ఓటింగ్ ద్వారా బాక్సుల్లో నిక్షిప్తం కానుంది.

ఆధిపత్యం కోసం పోరు

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత జిల్లాలో మూడు పార్టీల నేతల మధ్య ఆధిపత్య పోరు ప్రారంభమైంది. బయటకు గుంభనంగా ఉన్నప్పటికీ.. లోలోపల మాత్రం జిల్లాపై పట్టు సాధించేందుకు పోటీ పడుతున్నారు. ఈ క్రమంలో వచ్చిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ ప్రాబల్యాన్ని చాటుకునేందుకు ఎవరి ప్రయత్నాల్లో వారున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తరువాత పాకలపాటి రఘువర్మకు టీడీపీ ఎమ్మెల్సీ చిరంజీవి మద్దతు ప్రకటించారు. అతని నామినేషన్ దాఖలు సమయంలో స్వయంగా హాజరయ్యారు. కూటమి పార్టీలన్నీ రఘువర్మకు మద్దతుగా ఉన్నాయని ప్రకటించేశారు. చిరంజీవి వ్యాఖ్యలను బీజేపీ మాజీ ఎమ్మెల్సీ పి.వి.ఎన్.మాధవ్ ఖండించడం విశేషం. తాము మరో అభ్యర్థి గాదె శ్రీనివాసులనాయుడు విజయానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఆ ఘటనతో కూటమి పార్టీల్లో విభేదాలు బయటపడ్డాయి.

విందు, వినోదాలతో రచ్చ

పార్టీలకతీతంగా జరగాల్సిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను సైతం టీడీపీ, జనసేన భ్రష్టు పట్టించాయి. తమ మద్దతు అభ్యర్థి పాకలపాటి రఘువర్మ విజయానికి విందు, వినోదాలతో రచ్చ చేశాయి. పాకలపాటిని గెలిపించేందుకు టీడీపీ, జనసేన ఎమ్మెల్యేలు స్వయంగా రంగంలోకి దిగారు. ఒకరికొకరు పోటీ పడి మరీ ఉపాధ్యాయ ఓటర్లకు వరుసగా విందులు ఇచ్చారు. ఒకవైపు నేరుగా ఎమ్మెల్యేలు ఉపాధ్యాయులతో శిబిరాలు నిర్వహించారు. పాకలపాటిని గెలిపించాలని తాయిళాలు సైతం పెద్ద ఎత్తున పంచిపెట్టారు. సాధారణ ఎన్నికల తరహాలో ఉపాధ్యాయ ఎన్నికలను నిర్వహించడం పట్ల ఉపాధ్యాయులు సైతం విస్తుపోయారు. టీడీపీ, జనసేన తీరు పట్ల పలు ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి. ఉపాధ్యాయులను ప్రలోభాలకు గురి చేసి గౌరవ ప్రదమైన ఎన్నికల్లో రాజకీయం చేయడాన్ని తప్పుబడుతున్నాయి.

పోలింగ్ కేంద్రాలివే..

జిల్లాలో 13 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు జరగనున్నాయి. పెదగంట్యాడ జెడ్పీ హైస్కూల్, గాజువాక జెడ్పీ హైస్కూల్, పెందుర్తి ప్రభుత్వ హైస్కూల్, ఏయూ ప్రైమరీ స్కూల్, డాబాగార్డెన్స్‌లోని ప్రేమ యూపీ స్కూల్, రైల్వే న్యూకాలనీలోని కేఎస్ఎం హైస్కూల్, కంచరపాలెంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజ్‌లో పోలింగ్ జరగనుంది. అలాగే మల్కాపురంలోని జీవీఎంసీ ప్రైమరీ స్కూల్, గోపాలపట్నంలోని ఎస్‌వీఎల్ఎస్ జెడ్పీ హైస్కూల్, చంద్రంపాలెంలోని జెడ్పీ హైస్కూల్, పద్మనాభంలోని ఎంపీపీ స్కూల్, ఆనందపురంలోని ఎంపీపీ స్కూల్, భీమిలిలోని మహాత్మా గాంధీ యూపీ స్కూల్‌లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.



పెందుర్తిలోని పోలింగ్ కేంద్రంలో సిబ్బందితో తహసీల్దార్ ఆనంద్‌కుమార్

800 మందితో బందోబస్తు

ఎన్నికల కోసం 800 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద షామియానాలు, తాగునీరు, బయోటాయిలెట్లు ఏర్పాటు చేశారు. ఓటర్లు సులభంగా పోలింగ్ కేంద్రంలోకి చేరుకునే విధంగా మహిళలకు, పురుషులకు వేర్వేరుగా క్యూలైన్లు సిద్ధం చేశారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ద్వారా ఎన్నికల ప్రక్రియను రికార్డు చేయనున్నారు. పోలింగ్ ఏజెంట్లు, సిబ్బందితో పాటు ఓటర్లు కూడా కేంద్రం లోపలికి సెల్ ఫోన్లు తీసుకువెళ్లేందుకు అనుమతి లేదని అధికారులు స్పష్టం చేస్తున్నారు.



పోలింగ్ కేంద్రం వద్ద పోలీస్ సిబ్బంది

పోలింగ్‌కు సర్వం సిద్ధం

ప్రశాంత వాతావరణంలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. ఈ ఎన్నికల్లో 10 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. జిల్లాలో 13 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. 2,539 మంది పురుషులు, 2,990 మహిళలు మొత్తంగా 5,529 మంది టీచర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వచ్చే నెల 3వ తేదీన లెక్కింపు జరగనుంది. బుధవారం ఏయూలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల ద్వారా పోలింగ్ మెటీరియల్స్‌ను సిబ్బందికి అందజేశారు. ఎన్నికల ఏర్పాట్లు, సామగ్రి తరలింపు ప్రక్రియలను జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారి ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ స్వయంగా పర్యవేక్షించారు. అనంతరం ఏయూ ఇంజనీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని సహాయక రిటర్నింగ్ అధికారి బిహెచ్ భవానీశంకర్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు.



ఎన్నికల సామగ్రి తరలింపును పరిశీలిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్క్‌కు అడుగులు

- సరకు రవాణాలో సరికొత్త అధ్యాయం
- నాటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కేంద్ర, రాష్ట్రాల మధ్య ఒప్పందం
- ఎంఎంఎల్‌పీ ఏర్పాటుకు ఫీజిబిలిటీ స్టడీ కోసం ఆసక్తి వ్యక్తీకరణ టెండర్లు
- ఎంఎంఎల్‌పీని అనుసంధానించే పనుల డీపీఆర్‌కు కూడా టెండర్లు
- పార్క్ ఏర్పాటు ద్వారా 13 నుంచి 8 శాతానికి తగ్గనున్న రవాణా వ్యయం



సాక్షి, విశాఖపట్నం: లాజిస్టిక్ రంగంలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకునేందుకు విశాఖను ప్రధాన కేంద్రంగా మార్చేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన ప్రయత్నాలకు కీలక అడుగులు పడుతున్నాయి. సరకు రవాణా వ్యయం తగ్గించడంతో పాటు ఎగుమతి, దిగుమతులు సులభతరం చేసే మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్క్ జిల్లాలో ఏర్పాటు కానుంది. 2022 ఫిబ్రవరిలోనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఈ ఎంఎంఎల్‌పీ ఏర్పాటుకు సంబంధించిన ఒప్పందాలు జరిగాయి. అనకాపల్లి సమీపంలో దీన్ని ఏర్పాటు చేసేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దాదాపు 100 ఎకరాలను కూడా కేటాయించింది. తాజాగా లాజిస్టిక్ పార్క్ ఏర్పాటుకు సంబంధించి ఫీజిబులిటీ స్టడీ కోసం ఎన్‌హెచ్ఏఐ ఆసక్తి వ్యక్తీకరణ టెండర్లు పిలిచింది.

లాజిస్టిక్ రంగాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించాలన్న సంకల్పంతో గత ప్రభుత్వం తీసుకొచ్చిన లాజిస్టిక్ పాలసీ 2021–26కి అనుగుణంగా ఎంఎంఎల్‌పీలని అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. అనకాపల్లి, మునగపాక, పరవాడ మండలాలను కలుపుతూ జాతీయ రహదారికి సమీపంలో భూమిని గుర్తించారు. వల్లూరు, సిరసపల్లి, తాడి గ్రామాల మధ్య 396 ఎకరాల భూమి ఏపీఐఐసీకి ఉంది. ఈ భూముల్లో దాదాపు 100 ఎకరాలను లాజిస్టిక్ పార్క్ కోసం నాలుగేళ్ల క్రితం కేటాయింపులు చేశారు. గతంలో ఇక్కడ విశాఖ పోర్టు ట్రస్టు ద్వారా ఎంఎంఎల్‌పీ నిర్మించాలని భావించారు. అయితే సాగరమాల ప్రాజెక్టు ద్వారా పోర్టు స్థలంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించడంతో ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. ఇప్పుడు ఇదే ప్రాంతంలో లాజిస్టిక్ పార్కు రానుంది.

సాధ్యాసాధ్యాలపై అధ్యయనానికి టెండర్లు

ఏపీఐఐసీ సహకారంలో ఎన్‌హెచ్ఏఐ అనుబంధ సంస్థ నేషనల్ హైవేస్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ (ఎన్‌హెచ్ఎల్ఎంఎల్) ఈ ఎంఎంఎల్‌పీ బాధ్యతలు చేపట్టింది. లాజిస్టిక్ పార్క్ అభివృద్ధికి సంబంధించిన ఫీజబిలిటీ స్టడీతో పాటు ఈ పార్కును అనుసంధానిస్తూ రహదారులు, మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన డీపీఆర్ తయారు చేసేందుకు కూడా ఆసక్తి వ్యక్తీకరణ(ఆర్ఎఫ్‌పీ) టెండర్లు ఆహ్వానించింది. ఏప్రిల్ 8వ తేదీ వరకూ టెండర్లకు గడువు విధించింది. 9వ తేదీన బిడ్స్ ఓపెన్ చేసిన తర్వాత.. నిబంధనలకు అనుగుణంగా ఫీజబిలిటీ స్టడీస్‌కు సంబంధించిన పనులను అప్పగించనున్నట్లు ఎన్‌హెచ్ఏఐ అధికారులు తెలిపారు.

రవాణాకు కీలక కేంద్రంగా విశాఖ

ఒక ఉత్పత్తి కేంద్రంలో తయారు చేసిన వస్తువు ధర నిర్ణయించాలంటే అందులో రవాణా చార్జీలను కూడా కలుపుతారు. ప్రతి వస్తువు ధరలో 13 శాతం ఈ వ్యయంగా గణిస్తారు. మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కు ఏర్పాటైతే.. రవాణా వ్యయం తగ్గుతుంది. ఫలితంగా వస్తువు ధర కూడా తగ్గుముఖం పడుతుంది. దీని వల్ల కొనుగోలు దారులు లాభపడటమే కాకుండా అమ్మకాలు కూడా పెరిగే అవకాశాలుంటాయి. ఎంఎంఎల్‌పీ రావడం వల్ల రవాణా వ్యయం 13 శాతం నుంచి 8 శాతానికి తగ్గుతుందని అధికారులు చెబుతున్నారు. ఈ పార్క్‌ను జాతీయ రహదారి, రైలు, జల రవాణాతో అనుసంధానం చేస్తారు. ఇది జాతీయ రహదారికి 8 కిమీ, విశాఖ పోర్టుకు 33 కిమీ దూరంలో ఉంది. జలమార్గం ద్వారా సరుకు రవాణా చేస్తే చాలా వరకూ ఖర్చు తగ్గుతుంది. విశాఖ జిల్లాలో పోర్టులతో పాటు జాతీయ రహదారి, రైలు మార్గాలు కూడా అందుబాటులో ఉండటంతో ఈ లాజిస్టిక్ పార్కు పారిశ్రామిక తయారీ కేంద్రాలకు కీలకంగా మారనుందని భావిస్తున్నారు. ఎంఎంఎల్‌పీల్లో సరుకు నిల్వకు గోదాములు, శీతలీకరణ గిడ్డంగులు, ట్రక్కులు నిలిపే బే ఏరియా, డ్రైవర్లకు వసతులు, రెస్టారెంట్లు, పెట్రోల్ బంకులు, కస్టమ్ క్లియరెన్సులు, బల్క్ లోడింగ్ వంటి అన్ని సౌకర్యాలను అభివృద్ధి చేయనున్నారు.

కేజీహెచ్‌లో శిశువుల తారుమారు

సిబ్బంది నిర్లక్ష్యంతో ఇరువర్గాల ఆందోళన



కేజీహెచ్ గైనిక్ వార్డు

డాబాగార్డెన్స్: కేజీహెచ్ మరోసారి వార్తల్లోకెక్కింది. గైనకాలజీ వార్డులో బుధవారం ఉదయం చోటుచేసుకున్న సంఘటన తీవ్ర గందరగోళానికి దారితీసింది. ఇద్దరు తల్లులకు జన్మించిన శిశువులను వారి కుటుంబ సభ్యులకు అప్పగించడంలో సిబ్బంది చేసిన తప్పిదంతో రెండు కుటుంబాలు ఆందోళనకు దిగాయి. వివరాల్లోకి వెళితే.. పరవాడ, కృష్ణా జిల్లాకు చెందిన ఇద్దరు గర్భిణులు ప్రసవం కోసం ఇటీవల కేజీహెచ్‌లో చేరారు. కృష్ణా జిల్లాకు చెందిన గర్భిణీ పరిస్థితి విషమంగా ఉండటంతో బుధవారం ఉదయం 7.30 గంటలకు శస్త్రచికిత్స చేశారు. ఆమెకు మగ శిశువు జన్మించాడు. సిబ్బంది ధ్రువీకరణ పత్రాల ప్రక్రియకు అంతా సిద్ధం చేసి, శిశువును తల్లికి చూపించారు. ఫొటో కూడా తీశారు. ఆ తర్వాత, ఆ శిశువును కృష్ణా జిల్లా గర్భిణీ కుటుంబ సభ్యులకు ఇవ్వవలసి ఉండగా.. సిబ్బంది నిర్లక్ష్యంతో పరవాడకు చెందిన గర్భిణీ సహాయకులకు అందజేశారు. అక్కడకు కొద్ది నిమిషాల్లోనే లేబర్ రూమ్‌లో ఉన్న పరవాడకు చెందిన గర్భిణీ ఆడ శిశువుకు జన్మనిచ్చింది. కొద్దిసేపటి తర్వాత ఆడ శిశువును సిబ్బంది కృష్ణా జిల్లా గర్భిణీ కుటుంబ సభ్యులకు ఇవ్వడంతో గందరగోళం మొదలైంది. తమకు మగ శిశువు పుట్టాడని చెప్పి ఇప్పుడు ఆడ శిశువును ఇస్తున్నారేమిటని వారు ప్రశ్నించారు. సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడంతో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. ఉదయం 7.30 గంటలకు జరిగిన ఈ ఘటనను తొలుత సిబ్బంది దాచి పెట్టే ప్రయత్నం చేశారు. అయితే బాధితులు ఆందోళన చేయడంతో విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. సెలవులో ఉన్న సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ వెంటనే ఆస్పత్రికి చేరుకుని సిబ్బందిపై మండిపడ్డారు. ఏడుగురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసి విచారణ చేపట్టారు. సిబ్బంది నిర్లక్ష్యం వల్లే జరిగిందని ఆయన నిర్ధారించారు. ఇరువర్గాలను పిలిచి సమస్యను పరిష్కరించారు. కాగా..కేజీహెచ్‌లో సిబ్బంది శిశువులను మార్పిడి చేయడంలో ఆరి తేరారని, డబ్బుల కోసం వేధిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. సాధారణ ప్రసవం అయినా డబ్బులు డిమాండ్ చేస్తున్నారని, ఆపరేషన్ థియేటర్‌లో శిశువులను మార్చినా ఎవరికీ తెలియదని పలువురు గర్భిణులు, వారి సహాయకులు వాపోతున్నారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

శివరాత్రి వేడుకల్లో పార్కింగ్ కష్టాలు



ఏయూక్యాంపస్: శివరాత్రి పర్వదినం సందర్భంగా బీచ్‌రోడ్డులో బుధవారం ఏర్పాటు చేసిన వివిధ కార్యక్రమాలకు నగరవాసులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో పార్కింగ్ కష్టాలు తప్పలేదు. సరైన ట్రాఫిక్ నిర్వహణ లేకపోవడంతో ప్రజలు తమ వాహనాలను ఖాళీ ప్రదేశాల్లో నిలిపివేశారు. ఊహించిన దానికంటే ఎక్కువగా ప్రజలు రావడంతో ఫుట్‌పాత్‌లపై సైతం వాహనాలను పార్కింగ్ చేయాల్సి వచ్చింది. దీంతో ప్రజలు నడవడానికి వీలు లేకుండా పోయింది. పాండురంగాపురం నుంచి ఆర్.కె.బీచ్ వరకు ఇదే పరిస్థితి నెలకొంది. వాహనాల రద్దీ పెరిగిపోవడంతో రాత్రి 8.30 గంటల తర్వాత పోలీసులు బీచ్ రోడ్డులోకి వాహనాల ప్రవేశాన్ని పూర్తిగా నిలిపివేశారు.

తీరంలో నృత్య వైభవం

- పరమేశ్వరుడికి 'పరంపర' నాట్య నివేదన
- మంత్రముగ్ధులను చేసిన శాస్త్రీయ నృత్యాలు



ఏయూక్యాంపస్: పరంపర ఫౌండేషన్ ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డులో నిర్వహించిన 'నిమగ్న' నృత్య ప్రదర్శన సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచింది. విశ్వప్రియ ఫంక్షన్ హాల్ వద్ద జరిగిన ఈ అద్భుత నృత్య ప్రదర్శన విశాఖ ప్రజల మనసు దోచుకుంది. పరమేశ్వరుడికి నాట్య నివేదన చేసినట్టుగా తీరంలో సాగిన ఈ నృత్యాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. భరతనాట్య కళాకారిణి రమా వైద్యనాథ్ తన బృందంతో భారతీయ సంప్రదాయ నృత్య రీతులను వేదికపై ప్రదర్శించి.. విశాఖ వాసులను మంత్రముగ్ధులను చేశారు. 'శ్రీ గురుభ్యోనమః' అంటూ ప్రారంభమైన నృత్యం, కామాక్షి అమ్మవారిని ఆరాధిస్తూ.. కళ్లల్లో ప్రేమను చూపించిన విధానం, కాశీ నగర ఆధ్యాత్మికతను చాటుతూ విశ్వేశ్వరుడి శక్తిని కళ్లకు కట్టినట్టు చూపిన ప్రదర్శన, రాధాకృష్ణుల లీలలు వంటి అంశాలు ప్రేక్షకులను మైమరపింపజేశాయి. ఈ సందర్భంగా రమా వైద్యనాథ్ మాట్లాడుతూ నాట్యం పరిపూర్ణమైన సమర్పణ అని అన్నారు. కళలో పూర్తిగా లీనమై ప్రదర్శన ద్వారా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించడమే తమ లక్ష్యమని ఆమె వివరించారు. ఎంపీ శ్రీ భరత్ మాట్లాడుతూ విశాఖలో ఇంత అద్భుతమైన కళను ప్రదర్శించడం అభినందనీయమన్నారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి తదితరులు పాల్గొన్నారు.



తెన్నేటి పార్క్ వద్ద ఉదయం వేళ అద్భుతమైన దృశ్యం ఆవిష్కృతమైంది. ఒకవైపు ఉదయ భానుడు తన ప్రకాశవంతమైన కాంతితో చూపరులను మంత్రముగ్ధులను చేస్తుంటే.. మరోవైపు మత్స్యకారులు జీవనోపాధి కోసం శ్రమిస్తూ కనిపించారు. ప్రకృతి సౌందర్యాన్ని, మత్స్యకారుల జీవితంలోని కష్టసుఖాలను ఒకే ఫ్రేమ్‌లో 'సాక్షి' కెమెరా బంధించింది.

– ఏయూక్యాంపస్/ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

తల్లి మందలించిందని బాలుడి ఆత్మహత్య



దాసరి ఎర్నిబాబు మృతదేహం

మద్రిపాలెం: తల్లి మందలించిందని బాలుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం రాత్రి కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రెడ్డి కంచరపాలెంలో దాసరి ఎర్నిబాబు(15) తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్నాడు. తండ్రి ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఎర్నిబాబు ఎన్ఏడీ వద్ద కేవీలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. స్కూల్‌కి, ట్యూషన్‌కి వెళ్లకుండా పనుల్లోకి వెళ్తున్నాడని తల్లి మందలించింది. బుధవారం సాయంత్రం ట్యూషన్‌కి వెళ్లమని చెప్పగా బాలుడు సరే అని చెప్పి బాత్రూమ్‌కి వెళ్లి తలుపులు మూసుకుని తాడుతో ఉరి వేసుకున్నాడు. ఎంతసేపటికి బయటకు రాకపోవడంతో చూసేసరికి బాత్రూమ్‌లో విగతజీవిగా పడి ఉన్నాడు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు కంచరపాలెం పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. సీఐ రవికుమార్ నేతృత్వంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

శివరాత్రి స్నానాలకు పటిష్ట ఏర్పాట్లు



రుషికొండ బీచ్‌లో గజ ఈతగాళ్లకు సూచనలిస్తున్న ఏసీపీ నర్సింహమూర్తి

ఆరిలోవ: మహా శివరాత్రి సందర్భంగా భక్తులు రాత్రంతా జాగారం చేసి శనివారం ఉదయం సముద్ర స్నానాలు ఆచరించనున్నారు. ఇందుకోసం ఆర్.కె.బీచ్, జోడుగుళ్లపాలెం, సాగర్‌నగర్, రుషికొండ, అప్పికొండ, భీమిలి తదితర ప్రాంతాల్లో భక్తులకు జీవీఎంసీ, పోలీసులు ఏర్పాట్లు చేశారు. స్నానాలు చేసిన అనంతరం మహిళలు దుస్తులు మార్చుకోవడానికి వీలుగా ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసినట్లు జీవీఎంసీ అధికారులు తెలిపారు. రుషికొండ నుంచి జోడుగుళ్లపాలెం వరకు సుమారు 40 పోలీసులతో బందోబస్తు చేస్తున్నట్లు ఆరిలోవ సీఐ హెచ్.మల్లేశ్వరరావు వివరించారు. ద్వారకా ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తి జోడుగుళ్లపాలెం, సాగర్‌నగర్, రుషికొండ బీచ్‌లను సందర్శించి.. అధికారులకు పలు సూచనలు చేశారు.

ఉపాధికి పాలి టెక్నిక్

- పాలిసెట్- 2025 షెడ్యూల్ ఖరారు
- ఏప్రిల్ 30న ప్రవేశ పరీక్ష
- అందుబాటులో 8,592 సీట్లు



విశాఖ నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ



పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

విశాఖ విద్య: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలపై ఈ సారి ముందుగానే సాంకేతిక విద్యాశాఖ దృష్టి సారించింది. ఈ మేరకు పాలిసెట్ 2025కు షెడ్యూల్ ఖరారు చేసింది. ఉమ్మడి విశాఖపట్నం(విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు) జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో 28 కాలేజీలు ఉండగా, మొదటి ఏడాదిలో ప్రవేశాల కోసం 12 బ్రాంచిల్లో 8,592 సీట్లు అందుబాటులో ఉన్నాయి. పాలిటెక్నిక్ పాసైతే ప్రభుత్వ, ప్రైవేటు సెక్టార్‌లలో కొలువు గ్యారెంటీ కావడంతో..ఈ కోర్సుకు విద్యార్థుల్లో మంచి క్రేజ్ ఉంది. అలాగే ఇంజినీరింగ్‌లో నేరుగా చేరవచ్చు. 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులను పాలిటెక్నిక్ కోర్సుల వైపు తీసుకొచ్చేలా సాంకేతిక విద్యాశాఖాధికారులు దృష్టి సారించారు.

ఇదీ షెడ్యూల్..

10వ తరగతి ఉత్తీర్ణులైన వారు పాలిసెట్‌కు అర్హులు. ఏప్రిల్ 30న ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు సాంకేతిక విద్యాశాఖ షెడ్యూల్ జారీ చేసింది. పరీక్ష రాసేందుకు ఓసీ, బీసీ వర్గాలకు చెందిన విద్యార్థులు రూ.400లు, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారైతే రూ.100లు ఫీజు చెల్లించాలి. తగిన ధ్రువీకరణపత్రాలతో https://polycetap. nic. in/ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఈ వెబ్‌సైట్ మార్చి మొదటివారంలో అందుబాటులో రానుంది. ఇందుకు సిద్ధంగా ఉండాలని సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ హెల్ప్‌లైన్ కళాశాలల ప్రిన్సిపాళ్లను ఆదేశించారు.

పాలిటెక్నిక్‌తో ఉజ్వల భవిష్యత్

పాలిటెక్నిక్ డిప్లమో కోర్సులు చేరే విద్యార్థులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు దరిచేర్చేలా కళాశాలలకు అనుబంధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరిశ్రమలతో కాలేజీలను అనుసంధానం చేయడం ద్వారా ఏటా కాలేజీల్లో క్యాంపస్ సెలక్షన్లు నిర్వహించారు. నైపుణ్యత గల విద్యార్థులకు ఉద్యోగాలు దక్కాయి. దీంతో పాలిటెక్నిక్ కోర్సులపై విద్యార్థులు మొగ్గు చూపుతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలకు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్(ఎన్‌బీఏ) గుర్తింపు లభించింది. దీంతో సాంకేతిక విద్యకు విశ్వసనీయత పెరిగింది. ఈ ఏడాది కూడా అధిక సంఖ్యలో ప్రవేశాలు ఉంటాయని ప్రిన్సిపాళ్లు ఆశాభావం వ్యక్తం చేశారు.

ఉమ్మడి విశాఖ జిల్లాలో 28 కాలేజీలు

ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రభుత్వ ఆధ్వర్యంలో **విశాఖ నగరంలో** రెండు(కంచరపాలెం, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ ఇంజినీరింగ్), పెందుర్తి, భీమునిపట్నం(బాలికలు), అనకాపల్లి **జిల్లాలో అనకాపల్లి**, నర్సీపట్నం, అల్లూరి సీతా**రామరాజు జిల్లాలో** పాడేరు, రంపచోడవరం, **ఎటపాకలో పాలి**టెక్నిక్ కళాశాలలు నిర్వహిస్తున్నారు. **వీటిలో** వివిధ బ్రాంచిలకు సంబంధించి 1,779 సీట్లు అందుబాటులో ఉన్నాయి. అలాగే మూడు జిల్లాల పరిధిలో 19 ప్రైవేట్ కాలేజీలు ఉండగా, వీటిలో 6,813 సీట్లు ఉన్నాయి.

హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు



పాలిటెక్నిక్ కోర్సులు చేసిన వారికి మంచి అవకాశాలు ఉన్నాయి. పాలిసెట్‌కు సంబంధించి వివరాల కోసం కళాశాలలో హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేశాం. ఎక్కువ మంది విద్యార్థులు ప్రవేశాలు పొందేలా విస్తృత ప్రచారం చేపట్టేందుకు కార్యాచరణ సిద్ధం చేశాం. ఆసక్తి ఉన్న విద్యార్థులు కాలేజీలో సంప్రదించాలి.

– డాక్టర్ చంద్రశేఖర్, ప్రిన్సిపాల్, పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

హెల్ప్‌లైన్ కేంద్రాల్లో సమాచారం

పాలిటెక్నిక్ డిప్లమో కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి సాంకేతిక విద్యాశాఖ ఫోకస్ పెట్టింది. దరఖాస్తులు మొదలుకుని, విద్యార్థులకు కౌన్సెలింగ్ ప్రక్రియ ముగిసేంత వరకు సమస్త సమాచారం అందించేలా ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎనిమిది చోట్ల హెల్ప్‌లైన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. విశాఖ, పెందుర్తి, భీమునిపట్నం, అనకాపల్లి, నర్సీపట్నం, పాడేరు, రంపచోడవరం, ఎటపాక ప్రభుత్వ కళాశాలల్లో హెల్ప్‌లైన్ కేంద్రాలు అందుబాటులో వచ్చాయి.

మళ్లీ మావోయిస్టుల అలజడి

- జిల్లాలో ఉనికి చాటుకునేందుకు ప్రయత్నాలు
- మావోయిస్టుల సంచారంతో గిరిజనుల్లో ఆందోళన



రంపచోడవరం డివిజన్‌లో అటవీ ప్రాంతం

రంపచోడవరం: ప్రశాంతంగా ఉన్న జిల్లాలో మావోయిస్టు సంచారం అలజడి రేపుతోంది. గ్రామాల్లో మావోయిస్టులు సంచరిస్తున్నట్టు తెలియడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ ప్రాంతంలో పూర్తిగా పట్టుకోల్పోయిన మావోయిస్టులు తిరిగి తమ ఉనికి కాపాడుకునే ప్రయత్నాలు ప్రారంభించినట్టు తెలుస్తోంది. మూడు రోజుల కిందట వంద మంది వరకు మావోయిస్టులు రంపచోడవరం డివిజన్ మారేడుమిల్లి మండలంలోని గుడిసె పరిసర గ్రామాల్లో సంచరిస్తూ సమావేశాలు నిర్వహించారు. పక్కా సమాచారంతో పోలీసులు కూంబింగ్ చేయడంతో మాయివోస్టులు పరారయ్యారు. ఆ సమయంలో మారేడుమిల్లి మండలం పుల్లంగి పంచాయతీ చెందిన సాదల గంగిరెడ్డి, వలల వీరపురెడ్డి అనే ఇద్దరు మావోయిస్టు మిలిషియా సభ్యులను పోలీసు బలగాలు అదుపులోకి తీసుకున్నాయి. వారి వద్ద నుంచి మందుపాతరలకు ఉపయోగించే పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నాయి. చాలా కాలంగా జిల్లాలో మావోయిస్టు కదలికలు దాదాపుగా లేవు. తాజా సంఘటనతో గిరిజనులు ఉలిక్కిపడుతున్నారు. ప్రశాంతంగా ఉన్న జిల్లాలో ఎప్పుడు ఏం జరుగుతుందోననే ఆందోళన వ్యక్తమవుతోంది.

అరుణక్క ఆధ్వర్యంలో..

దండకారణ్యం ఏరియా కమిటీ సభ్యురాలు అరుణక్క ఆధ్వర్యంలో మావోయిస్టులు వై.రామవరం అప్పర్ పార్ట్, మారేడుమిల్లి లోతట్టు ప్రాంతాల్లో సంచరించినట్టు పోలీసులు నిర్ధారించారు.గుడిసె, చాపరాయి, పలకజీడి, దారలోవ తదితర గ్రామాల్లో మావోయిస్టులు ఇటీవల రెండుమూడు సార్లు సంచరించారని సమాచారం. ఈ ప్రాంతంలో మావోయిస్టు ఉద్యమాన్ని బలోపేతం చేసే దిశగా ప్రారంభించిన ప్రయత్నాల్లో భాగంగా అధిక సంఖ్యలో మావోయిస్టులు గ్రామాలకు వచ్చినట్లు తెలుస్తోంది. ఛత్తీస్‌గఢ్‌లో వరుస ఎన్‌కౌంటర్లతో భారీ సంఖ్యలో మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. దీంతో సేఫ్ జోన్‌గా భావించి ఆంధ్రా ఒడిశా బోర్డర్(ఏవోబీ) నుంచి తమ కార్యకలపాలను సాగిస్తున్నట్లు తెలుస్తోంది.ఏవోబీలో మావోయిస్టు కదలికలతో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రత్యేక బలగాలు అడవిని జల్లెడ పడుతున్నాయి. గతంలో ఏవోబీలో పెద్ద సంఖ్యలో మావోయిస్టులు, ముఖ్య నాయకులు ఉండేవారు. తూర్పుగోదావరి, విశాఖ ఉమ్మడి జిల్లాల ఏజెన్సీ ప్రాంతంలో తమ కార్యకలపాలను నిర్వహించే వారు. ఎన్‌కౌంటర్లు, ఉద్యమంలోకి వెళ్లేందుకు గిరిజన యువత ఆసక్తి చూపకపోవడంతో ఏవోబీలో మావోయిస్టులు పూర్తిగా బలహీనపడ్డారు. తాజాగా సేఫ్‌గా జోన్‌గా భావించి తిరిగి తమ ఉద్యమ కార్యకలపాలను ఇక్కడి నుంచి ఉధృతం చేస్తున్నట్లు తెలిసింది.

అభివృద్ధితోనే మావోయిస్టుల చెక్ ..

అభివృద్ధి పనులతోనే మాయిస్టులకు చెక్ పెట్టాలని పోలీసు యంత్రాంగం భావిస్తోంది. గతంలో కేంద్రప్రభుత్వ నిధులతో చేపట్టిన పలు పనులు మావోయిస్టుల దుశ్చర్యలతో నిలిచిపోయాయి. వాటిని మళ్లీ ప్రారంభించి పూర్తి చేయా లని పోలీసు యంత్రాంగం భావిస్తోంది. ఎంతో కాలంలో పెండింగ్‌లో ఉన్న గుర్తేడు,పాతకోట- మంగంపాడు రోడ్డు పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టింది. లోతట్టు ప్రాంతాలతో సహా అనేక గ్రామాలకు సెల్ నెట్ వర్క్ సేవలు అందుబాటులోకి తెస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో దాదాపుగా 69 సెల్ టవర్లను నిర్మించారు. గ్రామా ల అభివృద్ధి, సమాచార వ్యవస్థతో మావోయిస్టులకు చెక్ పెట్టేందుకు అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు.

యూటీఎస్ యాప్‌తో 3 శాతం క్యాష్‌బ్యాక్



యూటీఎస్ యాప్‌పై ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న రైల్వే అధికారులు

తాటిచెట్లపాలెం: జనరల్ రైల్వే టికెట్ల కోసం మొబైల్ యాప్ యూటీఎస్‌పై ప్రయాణికులకు ఈస్ట్‌కోస్ట్ రైల్వే వాల్తేరు డివిజన్ విస్తృత అవగాహన కల్పిస్తోంది. ఈ యాప్‌ను ఉపయోగించే వారికి 3 శాతం క్యాష్‌బ్యాక్ రాయితీ లభిస్తుందని వాల్తేరు డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. 2016లో ప్రారంభించిన యూటీఎస్ యాప్ ద్వారా ప్రయాణికులు ప్లాట్‌ఫాం టికెట్, సాధారణ జనరల్ టికెట్లు సులువుగా బుక్ చేసుకోవచ్చన్నారు. ఈ యాప్‌పై ప్రయాణికులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్లాట్‌ఫాంలపై పోస్టర్లు, కరపత్రాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఆర్–వ్యాలెట్ రీచార్జ్ చేసుకుని, యూటీఎస్ యాప్ ద్వారా సాధారణ రైలు టికెట్ బుక్ చేసుకున్న వారికి 3 శాతం రాయితీ లభిస్తుందన్నారు. ఈ అవకాశం ఈ ఏడాది ఆగస్టు 24వ తేదీ వరకు అందుబాటులో ఉంటుందన్నారు.

వేర్వేరు కేసుల్లో 25.5 కిలోల గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయితో జీఆర్పీ,ఆర్పీఎఫ్ సిబ్బంది

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్ మీదుగా గంజాయిని రవాణా చేస్తున్న నిందితులను బుధవారం రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలివీ.. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ అబ్దుల్ మారూఫ్, ఆర్పీఎఫ్ ఏఎస్ఐ జె.టి.నాయుడు వారి సిబ్బందితో కలిసి బుధవారం విశాఖ రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. కేరళ రాష్ట్రం ఎర్నాకుళం జిల్లాకు చెందిన అనిల్ రాజ్ వద్ద గంజాయి ఉన్నట్లు ఏఎస్ఐ నాయుడు గుర్తించారు. అతన్ని అదుపులోకి తీసుకుని ఎస్ఐకి అప్పగించారు. అతని వద్ద నుంచి రూ. 87,500 విలువైన 17.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అతన్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

మరో కేసులో 8 కిలోల గంజాయి సీజ్

మరో కేసులో గంజాయి తరలిస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన మీర్ హసన్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి రూ.40 వేల విలువైన 8 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల్లో జీఆర్పీ ఎస్ఐ కె.శాంతారాం, ఆర్పీఎఫ్ ఏఎస్ఐ పి.శివనారాయణ తమ సిబ్బందితో కలిసి పాల్గొన్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

సర్వం...శివోహం

రావికమతం మండలం కల్యాణ లోవలో జలాశయంలో పుణ్యస్నానాలు



మహాశివరాత్రి సందర్భంగా పంచదార్లలోని ఉమాధర్మలింగేశ్వరుడిని, ధారమఠంలోని ధారమల్లేశ్వరుడిని, చోడవరంలో గౌరీశ్వరుడిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. కల్యాణలోవ జలాశయం, బలిఘట్టం ఉత్తరవాహిని, పంచదార్లలోని ఆకాశధారల్లో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు.– అనకాపల్లి

బాలుడిని కాపాడిన లైఫ్‌గార్డ్స్



బాలుడిని సురక్షితంగా కాపాడిన లైఫ్‌గార్డ్స్

కొమ్మాది: రుషికొండ బీచ్‌లో ఓ బాలుడు కొట్టుకుని పోతుండగా లైఫ్‌గార్డ్స్ ప్రాణాలతో కాపాడారు. వివరాలివీ.. కొమ్మాది చెందిన శంకర్ తన మేనల్లుడు దుర్గాప్రసాద్‌తో కలసి బుధవారం బీచ్‌కు చేరుకున్నాడు. కాసేపటి తర్వాత దుర్గాప్రసాద్ బీచ్‌లో స్నానం చేసేందుకు దిగాడు. ఈ క్రమంలో అలల ఉధృతి ఎక్కువగా ఉండటం వల్ల దుర్గాప్రసాద్ కొట్టుకుని పోతుండగా.. శంకర్ పెద్దగా కేకలు వేశారు. విధుల్లో ఉన్న లైఫ్‌గార్డ్స్ ఎస్.నూకరాజు, అమ్మోరు, ధనరాజు, చిన్నప్పన్న, రవివర్మ వెంటనే సముద్రంలోకి దిగి బాలుడిని ప్రాణాలతో రక్షించారు. అనంతరం తీరానికి తీసుకొచ్చారు.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.87,820
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.80,500
వెండి(కిలో):	రూ.1,06,000

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.71
స్కిన్	: రూ.152
స్కిన్‌లెస్	: రూ.162

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	482.00
విజయనగరం	486.00
శ్రీకాకుళం	486.00